



*జడమైన ప్రకృతి సౌందర్యం కదిలించే జడ! వసుంధర హృదయానికి పడగపట్టినదది. ముడువు కట్టినదంటే మమకారం పెరుగునా!*

---

'అంట్లు వెయ్యండమ్మగారూ! తోవే సెల్లి పోతా.'

'అంత తొందరేవిటే? అవత లేవైనా కొంప అంటుకొన్నాయా?'

'ఆ..మీరంటే గేపకం వచ్చింది. మా అవత లీధి తగలడిపోనాది గావండీ మాదాకా రానేదు. వంురింజిన్లొచ్చి ఆరిపేసినాయి.'

'సరేగాని...వంటింటి తలుపు తోసి తీసుకో! వారనే ఉన్నాయి. లేవడానికి ఒళ్లంతా బద్ధకంగా ఉంది. లోపలి కడుగు పెట్టావు సుమా! అత్తగారి ఆచారానికి అపచారం జరిగేను!'

'ఔనుగానండీ! మామ్మగారు యాత్తర్లకెల్లి యెప్పుడొత్తారండీ?'

'ఏమోనే!'

బద్ధకంగా పందిరి మంచాన్ని అంటిపెట్టుకుని పడుకొన్న వసుంధర ఒళ్లు విరుచుకొంటూ

లేచింది.

పని మనిషి మంగి వంట గిన్నెలూ, కంచాలూ తీసి తోముతూన్న చప్పుడు వసుంధర ఆలోచనలకు తాళం, లయ వేస్తున్నట్టుంది. తలమీద గుప్పెడు వెంట్రుకల్నీ చిందర వందరగా చెరిగిపోయిన ముఖంమీద సరిజేసుకొంటూ మంగి ఏంచేస్తూందో చూద్దామన్నట్టు గది బయటికొచ్చింది.

ఎదురుగా అద్దంలో తన ముఖమండలం ప్రతిబింబిస్తూంది. తలకట్టులేని సౌందర్యం ! తలకట్టులేని అక్షరంలా వెలవెల లాడుతూఉంది! ఎన్ని రకాల నూనెలూ, ఔషధాలూ, ప్రక్రియలూ చేసినా గ్రొరెకు బెత్తెడే తోకలా పెరగని జుత్తు చూసుకొని ఏంచేస్తుంది పాపం! అన్నింటికీ పూర్వజన్మ సుకృతా లున్నట్టే దీనికీ ఏవో ముడులుండి ఉంటాయ్!

ప్రకటనలూ, అమ్మకాలవాళ్ల ఎత్తుకు పై యెత్తులన్నింటికీ బలయిపోయిన తన తలకట్టు ఏం పాపం చేసుకొందో తనూ తన భర్త శివనాథరావుగారూ ఒకర్నొకరు ఓదార్చుకోవల్సివస్తూంది.

'విగ్గొకటి కొని వేసుకోకూడదూ?' అని శివనాథరావుగారి వేళాకోళం.

అలాంటి కృత్రిమ పద్ధతులంటే తనకు ఏవగింపు.

'అదేమే మంగీ! జుట్టలా చిందర వందరగా ఉంది? అయ్యో కర్మ! జడ అలా క్రింద పడి అంట్లమీద అల్లాడుతూంటే చూస్తూ ఊరుకొన్నావుటే?'

మంగి వసుంధరమ్మగారి మాటలకు అభిమానపడుతూ, జడ ముందుకు వేసుకొనేందుకు ప్రయత్నించింది.

'ఉండు—నీది అంట్లచెయ్యి' — అంటూ వసుంధర మంగి దగ్గరకు వచ్చి, నీరెండ బంగారు కిరణాలకు మిల మిల మెరుస్తూన్న మెడమీద మంచి చుట్టజుట్టి, వీపుమీద వ్రేలాడదీసింది.

మంగి సిగ్గుతో ప్రిదులుతూ, 'మీరెందు కండమ్మగారూ!' అని నవ్వుకొంది. ఒంటిరాయి ముక్కు పుడకమీద, చెవుల నక్షత్రాలమీద నీరెండలు తళుకు తళుకున పదును పెట్టుకొంటున్నాయి.

వసుంధర కళ్లలో తృప్తి వన్నగా విరిసింది. గాజుల ఘల ఘలలో ఐక్యమై గిన్నెలు తోముతూన్న గరగర మధుర మధురంగా చెదిరిపోతూంది.

'అదేవిటే! చింపిరి గంపలా తలా నువ్వూనూ?'

'నా కెందుకేటండీ సోకులూ..యేసాలూ...' కళ్లలో తమ ప్రతిబింబాలు చూచుకోవాలని వ్రాలుతూన్న ముంగురుల్ని గాజుల ఘల ఘలతో వారిస్తూ అంది మంగి.

అమ్మగారికి తనంటే ఎందుకో అంత చెప్పుకోలేని అభిమానమూ, ఆప్యాయమూ. తన తల్లి చనిపోతూ 'మంగీ, మంగీ! ఆ కుటుంబాన్నే కనిపెట్టుకునుండు తల్లీ! పెట్టినా పోసినా ఆరే దిక్కు...' అని చెప్పి మరీపోయింది. తమన్నన్నాళ్ళూ ఇక్కడే తన రక్తాన్ని ధారపోసింది. వారసత్వం హక్కులా తన కప్పజెప్పి వెళ్లిపోయింది. కాని తన కెప్పుడూ దాసీతనం అనే భావం కలగనే లేదు. ఇంటిలో మనిషిలాగే మసులుకొనేది. ఇంటి పనులు సవరించడమే కాకుండా, పక్కలు వెయ్యడం, తియ్యడం, బజారు చేసుకురావడం—ఒకటేమిటి? అన్ని పనులూ తన బాధ్యతమీదనే వదిలేస్తారు!

గిన్నెలూ అవీ పూర్తిచేసి, జడ వెనక్కు విసురుకొంది. రాత్రి అమ్మగారిచ్చిన పూలు వాడి వత్తలై ఇంకా జడ వెంట్రుకల్ని పట్టుకొని వ్రేలాడుతున్నాయి.

నాగుత్రాచులా బారెడుపొడుగయిన జడచిక్కగా ఒత్తుగా జఘనసీమల్ని తాకుతూ ప్రవహించిపోయే సెలయేరులా—ఎక్కడ దీని సౌందర్యం ఆగడం?— ఆ జడ జడమైన ప్రకృతి సౌందర్యాన్ని కదిలిస్తూన్నట్టుంది! వసుంధర హృదయానికి పడగపట్టినట్టుంది!

'ఏవేఁ మంగీ! తల దువ్వుకోకుండా ఏవిటా చింపిరిగంప వేషం?'

'ఎవరు సూసి సంతోషించను సెప్పండమ్మగారూ! నా యేషం....పొద్దుగూకులూ తిరిగి తిరిగొచ్చి తాగి తందనాలు తొక్కుతా నాతాడు తెంచుతాడు. ఆడివాళ్ల నాకు సుఖంలేదు. సుబ్బరంనేదు. ఆడితో యేగనేక ఏనుయ్యో, గొయ్యో...' సిగ్గూ దుఃఖం సమ్మిళితమైన కంఠంలో గద్గదికత కళ్లలో విషాదంతో రంగరించుకొని వినిపించుతూంది.

'ఇప్పుడా గొడవెందుకు గానీ,రావే జడవేస్తా.'

నిర్మల హృదయం లేనివాడు,
ఉద్రేకాలను అణచుకొనలేనివాడు
విద్యావంతుడు కాడు.
—గాంధీజీ

ఏనాటినుంచో గూడుకట్టిన కోర్కె ఒక్కసారి పగిలినట్టయింది.

'అమ్మగారూ!' అంటూ ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయింది మంగి.

'మరి మాటాడకు' అని ఘుమ ఘుమలాడే అత్తరు నూనెరాసి, తలంతా సున్నితమైన వ్రేళ్లతో అప్యాయంగా దువ్వుతూ, పాయలు పాయలుగా దువ్వి, వదులు వదులుగా జడ మెడమీద వదులుతూ, రెండు కొండలమీదనుంచి లంఘిస్తూన్న రెండు జలపాతాల్ని ఏదో అపూర్వ ఇంద్రజాల హస్తంతో పెనవేస్తున్నట్టు జడ వేస్తూంది వసుంధర.

'ఏవేఁ జడకుచ్చులు వెయ్యమంటావా?'

'ఊహుఁ. వద్దండి అమ్మగారూ! మూనాళ్ల ముచ్చట కింత మోజెందుకు పోనీండమ్మా!'

'అదేవిటే అలాగంటావు?'

తలుపు చప్పుడు వినిపించింది.

'అయ్యగారొచ్చినట్టున్నారు తలుపు తీసొస్తా మండవే!'

'మీరెందు క్కొసొండమ్మ గారూ! నేనెళ్లి తీసొస్తా. మీరొట్టి మనుసులుకారు' అంటూ మంగి ఒక్క ఉంగున లేడిలా దూకి వెళ్లింది.

వసుంధర సంతృప్తిగా నిట్టూర్చింది.



భగ్న వీణ    చిత్రం—టి. ఆనంద్ (కాకినాడ)

భ్రాంతి సర్పంలాంటి దాని జడ తన హృదయాన్ని చుట్టబెట్టుకొన్నట్టుంటుంది. దానిక్కారణం తనకే తెలియదు!

అవతల సంభాషణ వ్యక్తావ్యక్తంగా వినిపిస్తూంది నవ్వుల పువ్వుల మధ్య నలుగుతూ.

'ఏమేవ్! మంగమ్మా! ఘుమఘుమలాడిపోతున్నావ్! ఏవిటి విశేషం ఇవ్వాళ? రాణీ మంగమ్మలా తయారయావ్!'

'భలేవారండీ! అయ్యగారూ! అమ్మగారేదో సరదాపడి నాకు జడేస్తా వాసన్నాని రాసి పట్టున్నారు. నాకెందుకు చెప్పండియ్యన్నీ!'

ఇద్దరి మధ్య నవ్వుల రాణి ఘలంఘల వర్తిస్తూన్నట్టుంది. మంగి రాగానే 'ఏవండీ! మీరూ బాగానే వచ్చారు సమయానికి. సినిమాకు తీసుకెళ్లండి. మంగి కూడా సాయంగా వస్తుంది' అంది వసుంధర.

'వద్దండమ్మగారూ! నేను రాను. ఆ డొప్పు కోడు. నేనింటికాడ నేకపోతే యిర్సిరుసుకు పడిపోతాడు.'

వసుంధర శివనాధరావుగారి కళ్లలోకిచూసింది. ఆయన కళ్లు మంగివైపు తిరిగాయి. కరుడు గట్టిన మంచు వేడికి కరుగుతూన్నట్టుంది.

అభిమానాస్పదమైన చోటు ఎక్కడైతే ఉందో అక్కడ హృదయామృతం ఎప్పుడూ వర్షిస్తూంటుంది. శివనాధరావు వసుంధర తలకట్టువైపు చూశాడు. తలకట్టులేని అక్షరంలా ఉంది! ఎవరిదైనా తలకట్టు చూసి ఎంత మురిసిపోతుందో? అది మంగి తలకట్టులో చూసుకొని తనకు లేనిదానికి అసూయ చెందక, పొంగిపోతూంది అమాయికురాలు! తలంతా వెదికితే గుప్పెడు వెంట్రుకల్లేవు. లోకంలో ఏది కోరినా తెచ్చివ్వడానికి సిద్ధంగా ఉన్నాడు తను. కాని ఏం లాభం?

జడ పూర్తిచేసి, 'చూసుకో నీ జడ అందం—నీ అందం' అన్నట్టు ముందుకు పడేసింది. పడగెత్తిన త్రాచు పడిలేచినట్లు ఒక్కసారి జడ చూసుకొని మురిసి పడి వెనక్కు వేసుకొంది.

'ఉండు. సన్న జాజులదండ గుచ్చాను పెట్టుకొందువుగాని—'

'నా కెందుకండమ్మగారూ!' అంటూ నసిగింది మంగి.

వసుంధర మనస్సు కలుక్కుమంది.

తన ఆనందాల్ని అభిమానాల్ని ఎక్కడైతే చూసుకొని వర్షించాలనుకొంటూందో, అదే వ్యతిరేకిస్తే తనేవిటి చేయడం?

శివనాధరావుకు ఆమె ముఖ కవలికలోని భావం మనసును స్పర్శించింది.

'పెట్టించుకో మంగీ! అమ్మగార్ని అడ్డు పెట్టకు—'

మంగి తెల్లబోయి చూసింది. కళ్లలో ఆనందం జల్లులు జల్లులుగా పడుతున్నది.

తన తలలో తురిమిన జాజిపూలదండ వెన్నెల చలువల్ని కురిపిస్తూన్నట్టుంది.

'ఏవే చిరడిగావుకాదూ? తీసుకెళ్లు.

# జడ ప్రకృతులు

'ఇప్పు డొద్దండమ్మగారూ!' దిగులుగా అన్నట్టున్నాయ్ మాటలు.

'పిచ్చిదానా! ఆ మసిపాతే బావుందేవిటే నీ అందానికి—మారుమాటాడక కట్టుకొని వెళ్లు.'

మంగికి తప్పలేదు. వసుంధర శరీరంమీద నలిగిన సిల్కుచీర కట్టుకొని, అమ్మగార్ని, అయ్యగార్ని సెలవడిగిపోయింది.

'ఏవిటి వసూ! అలా కన్నీళ్లు....'

వసుంధర కళ్లలో సిగ్గు కరుగుతూ, '..ఆనంద బాష్పాలండీ! ఈ రోజేదో కొత్త బరువు మోస్తున్నట్టుంది ఒంటరితనం....' అన్నది.

శివనాధరావు దగ్గరకు తీసుకుని, 'ఇంక కొన్నాళ్లేగా! ఒంటరితనం పోతుంది. తోడుగా పాపడు పుడతాడు....' అన్నాడు.

సంజె పెదవులమీద అరుణరాగాన్ని చుంబిస్తూన్న ఆకాశరాజుకు శిరోజాల చీకటి ముసుగు కప్పుతూన్నట్టుంది.

*　　*　　*　　*

'ఇంత రేతిరేళయినా ఆడింకా రానేదే' అనుకొంది మంగి. పొయ్యిమీద ఎసరు గుద్దుకొంటూంది. కొరకంచులు కొర కొర మండుతున్నాయి.

తూగుతూ తూలుతూ వచ్చాడు జగ్గన్న. రాక పసిగట్టింది. గుప్పున చెడువాసన కొట్టింది. తన తలలో సువాసనలు, వాడినోటి దుర్వాసనల సంఘర్షణలమధ్య నలిగిపోతున్నయి విరజాజులు.

మత్తు దిగుతూన్నట్టుంది జగ్గన్నకు.

'ఏటేవ్! ఎప్పుడూ లేనిసోకులు. మరీ ఘుంఘుంలాడిపోతున్నావ్? ఆ సీరేటి? ఆ పూలేటి?'

'సీర అమ్మగారిచ్చారు. అది సరేగాని, రోజా రోజాకీ అలా మితిమీరిపోతంటే ఏటెదారి? ఆ యేపాలేటి,ఆ తాగుడేటి?'

'నోర్ముయ్! నీతులు సెప్పొచ్చేవేటి నాకు! ముందు నీ సంగతంతు తేల్చు.'

'అమ్మగారేదో సరదాపడి, సింగారింతే కళ్లల్లో కారం జల్లుకొంటన్నావేం పొయ్యేకాలం? నీ గొడవేదో నువ్వు తగలడు.'

'తగలడతా, తగలడతా! అమ్మగారెట్టారో? అయ్యగారెట్టారో—అంతు తేల్చుతానే భోసిడిక్కా!' అంటూ జగ్గన్న మంగిమీద పడి, తలకట్టు మొదలంట పట్టి, ఈడ్చుతోశాడు.

'అమ్మో' అని కేకవేసింది. నులక మంచం కోడుకు తలకొట్టుకుంది. నుదుటిమీద నెత్తురు చిట్లింది. పగపట్టిన కోడె త్రాచులా కస్సున లేచిన జడ, కుబుసం విడిపించిన పాములా వెలరేగింది.

జగ్గన్న కళ్లు నులువు కొన్నాడు. ఎంత పొడుగుపాటి జడ!

'ఒరేయ్ జగ్గూ! మీ ఆవిడ తలకట్టు చాలా ఒత్తుగా భారీగా బావుంటుందిరా! ఇంతమందిని చూశాను గాని, అలాంటి జడెక్కడా చూడలేదురా! మా అమ్మాయి సవరానికలాంటిది కావాలిరా! నీ వడిగిన సొమ్మిస్తా... ఎప్పుడు తెస్తావో....' అనేవారు జమిందారిణిగారు-ఎప్పుడయినా వారింటికి కూలి పనికి పోయినపుడు.

ఆ మహాతల్లి పాదాలముందు దీని తల కత్తిరించి పారేస్తే పుష్కలంగా డబ్బు దొరుకుద్ది.

జగ్గు ఆలోచన తోచగానే బయటికి పరువెత్తాడు, తగ్గిపోయిన నిషా పదు నెక్కించడానికి.

మగత విడిన మంగి లేచి చూసేసరికి జగ్గన్న లేడు. పొయ్యిమీద కుండలో కూడు మాడిందో, ఏం మూడిందో వెళ్లి మూత పైకెత్తింది. చెయ్యి చురుక్కున కాలింది. కమిలిపోయాయి వ్రేళ్లు. అప్రయత్నంగా జుత్తులోకి వ్రేళ్లు పోనిచ్చింది. వసుంధరమ్మగారికి అతి ప్రియమైన ఈ జుత్తులో ఏం ఉందో తనకు తెలియదు గాని, చిందర వందరగా తయారయి రేగిపోయింది. చావ జంపిన పాములా జడ వ్రేలాడిపోయి ఉంది.

'పాపిస్టి డెంతపని సేసిపోయాడు! ఆడి కళ్లు ఈ జుట్టుమీదే పడాలా?' అనుకొని వాపోయింది.

పొయ్యిమీద కుండ పక్కకు ఒరిగిపోయింది. చూరులో ఎలుకలు మిర్రి మిర్రి చూశాయి మంగి శిరోజాల చీకటి గుబురుల్లో వావవలు పీలుస్తూ.

బయట్నుంచి కేక వినబడింది.

'మంగీ! మంగీ! జగ్గుని పోలీసోళ్లు పట్టుకొన్నారంట. తాగి రోడ్డుమీద తందనాలు తొక్కుతూంటే మాస్తా ఊరుకొంటారేటి?'

అవతలవాడు కష్టంగా మాట్లాడి తుర్రుమన్నాడు. ఎవరా అని బయటికి తొంగి చూసింది మంగి.

'ఆడింటి కొచ్చిందాకా భయమే! ఏ మహాయిత్తం తెచ్చెడతాడోనని....ఈ రోజే దో మూడింది. కర్మ ముందుకు తోసుకొచ్చింది. ఆడి తాగుడు పాపం బద్దలయింది' అని వాపోయింది.



ఎక్కడికీ పయనం ?
ఫోటో—ఓట్టి త్రినాధ్
(కటక్-1)

గుడిసె అంతా నెత్తిమీద పడి కూలుతూంది. జుట్టంతా పిచ్చిగా రేగిపోయింది. కళ్లు పొగ చూరి, ఆవిరిగా మారి, జల జల అశ్రువులు రాలుస్తున్నాయి. ఎంతయినా వాడు తన భర్త! ఏది దారి? ఎక్కడకు వెళ్లడం? ఈ అర్ధరాత్రి!

• • •

తెల తెల్లవారుతూంటే శివనాథరావుగారు వీధి తలుపులు తెరిచారు. గుమ్మంలో అడుగు పెట్టారో లేదో కాలికి మెత్తగా ఒత్తుగా గరగరగా తగిలింది.

'అమ్మో! పాము' అనుకొన్నారు. వంగి చూశారు. ఇంత పొడుగాటి జడ తన పాదాల మీద తారట్లాడుతూంది.

ఎవరూ? మసక మసక వెలుతురులో మొహం మీదికి వంగి చూశారు. మంగి!

వసుంధరను పిలిచారు.

కళ్లు నలుపుకొంటూ బయటి కొచ్చి మంగిని లేపింది.

'ఏవే, ఎప్పుడొచ్చావు? అలాగున్నావేం? తలంతా చెదిరిపోయి, జడ నలిగిపోయి...నుదురు మీద ఆ బొప్పేవిటి?'

'అబ్బే యేంలేదండమ్మగారూ! మంచం కోడు కొట్టుకుందండీ! ఇప్పుడే వచ్చానండీ. కేకేస్తే పలకలేదు. మాయదారి నిద్ర ఎప్పుడొచ్చిపడిందో?'

మంగి కళ్లల్లోకి చూసింది వసుంధర. అది చెబుతున్నవన్నీ అబద్ధాలని ఎర్రవారిన కళ్లు ఘోషిస్తున్నాయి.

'వాడేవన్నా అఘాయిత్యం చేశాడేవిటే?'

'ఏం నేదండీ! ఇదంతా నాకరమ....రేతిరి తాగి, యింటికొస్తుంటే పోలీసోళ్లట్టుకొన్నారంట! అంతకంటె నాకింకేం తెలవదండి. అయ్యగారే ఆణ్ణి యిడిపియ్యాలి...'

మంగి దీనంగా వేడుకొంటున్నట్టుంది.

వసుంధర శివనాథరావు గారి వైపు చూసింది. ఆయన ముఖం చిట్లించుకొన్నారు.

'పోతే పోనీ...నాలుగురోజులు జైల్లోపడి మగ్గితేనేగాని బుద్ధిరాదు. వచ్చి నిన్నేం సుఖపెట్టేనా, ఏడిచేనా....' అన్నారు.

'అలాగనకండి అయ్యగారు! ఎంతయిదయినా ఆడు నావోడు. తాలిగట్టినోడు. ఆణ్ణి సూడకపోతే ఒక సెణం ఉండలేను. ఇక పేటలో జనం నన్ను కాకుల్లా పొడుసుకు తినేస్తారు.'

మంగి చీపురు నరిజేసుకొని నడవ ఊడుస్తూంది. గరగర శబ్దం నిశ్శబ్దాన్ని చెరుగుతూన్నట్టుంది.

'....పోతే తలయినా అమ్ముకొని, ఆణ్ణిడిపించుకోవాలి.'

వసుంధర గుండె కలుక్కుమంది.

'ఏవండీ!?' అన్నట్టు చూసింది వసుంధర.

ఆయన ముఖం త్రిప్పుకొన్నాడు.

వాళ్లకు కష్టాల్లో తమెందుకు సాయపడటం? పూనుకొని తీర్చాల్సిన అవసరం ఏమిటి? వసుంధరకు ఆలోచన పాలుపోవడంలేదు.

అది గదులు ఊడిచేటపుడు వసారా చిమ్ముతూన్నపుడు పాపం! దాని జడ కిందపడి దానికి సహాయం చేస్తున్నట్టుంది!

మన్మథుడి కొరడా చివర్లు నలిగి తేలినట్లున్న జడ....అలా మెడను పెనవేసుకొని, ముఖమండలంమీద మేఘంలా కమ్ముకొని జీరాడుతూంటే ఎంత అందంగా ఉంటుందో!

దాని కేశాలు సంస్కరించాలని, దాని జుత్తులో తన జుత్తు చూసుకోవాలని, దాని తలలో రకరకాల పరిమళాలు తురమాలని, ఎందుకో ఈ ఊహల అగాధాల్ని దాటే స్వప్న నౌకలు తన చుట్టూ పరిభ్రమించడం?

కొళాయి ధారగా పడుతూంది.

కళ్లు తూలిపడుతున్నట్లున్నాయి మంగికి. గిన్నెలూ అవీ తోమేందుకు చేతులాడ్డంలేదు.

'ఏవే మంగీ! ఆ గిన్నెల్నిలా పడెయ్యి.' వంటింట్లోంచి కేక వేసింది వసుంధర.

గిన్నెలు తీసుకుని నాలుగడుగులు వేసిందో లేదో కళ్లు తిరిగి పడిపోయింది. చప్పుడు విని వసుంధర పరుగున వచ్చింది. 'ఏమండీ! మంగి పడిపోయిందండీ! రండీ!'

శివనాథరావుగారు పరుగున వచ్చారు.

'అదేవిటలా చూస్తారేం? రెక్క పట్టుకొని సాయం పట్టండి!'

ఆయన యాంత్రికంగా నిర్వహించాడు. ఇద్దరూ సాయంపట్టి, మంచంమీద పడుకోబెట్టారు. మొహంమీద నీళ్లు చల్లారు.

'మంగీ! మంగీ!'

'అమ్మగారు....అమ్మగారు...' సిగ్గుతో కళ్లు తెరిచింది.

'ఏవే! రాత్రి తిండి కూడా తిన్నట్టు లేదు. అంత దిగులెందుకు?'

మంగికి నోటమాట పెగల్లేదు.

'అమ్మగారికీ, అయ్యగారికీ సేవ సెయ్యాల్సింది పోయి, ఆరిసేతె సేయించుకొంటున్నాను పాపిష్టిదాన్ని' అనుకొని గుడ్లలో నీరు త్రిప్పుకొంది.

'కాసిన్ని పాలచుక్కలు తాగు. తెరిపిన పడతావు. మనసులో మరేం దిగులు పెట్టుకోబోకు. వాణ్ణి జైలునుంచి విడిపించుకొందూ గానిలే!' అని వసుంధర బుజ్జగించింది.

ఈ మమతలకూ, ఆప్యాయతలకూ, అభిమానాలకూ ఎక్కడో హద్దులు నిర్మించుకోవాలని హృదయంలో వెదుక్కుంటూ నిట్టూర్చింది మంగి.

'ఇవ్వాళ్టి కింకేంపని చెయ్యనక్కర్లేదులే! వెళ్లు. ఇంటికి పో! ఇదిగో ఈ డబ్బు పట్టుకెళ్లి వాణ్ణి విడిపించుకో!' అని వసుంధర పాతిక రూపాయలు మంగి చేతి కిచ్చింది.

మంగి కిక్కురుమనకుండా కళ్లలో కృతజ్ఞత కురిపిస్తూ బయటపడింది.

> *అదృష్టం చంచలమైనది. నిరంతరం తిరిగే చక్రనేమి క్రమాన్ననుసరించి పడుతూ లేస్తూ ఉంటుంది.*

పోలీసువాళ్లకు, ఇనస్పెక్టరుముందు ఆడబ్బు పారేసి జగ్గన్నను విడిపించుకొంది.

ఇన్‌స్పెక్టరు లంచం పుచ్చుకొని, ఆశ్చర్యంగా చూస్తూ, 'ఒరేయ్! ఆఖరికి నీ పెళ్లాం నిన్నిడిపించాల్సి వచ్చిందిరా! అదృష్టవంతుడివి బతికిపోయావు. పోయి, బుద్ధిగా మసులుకో!' అన్నాడు వాణ్ణి విడిచేసి. వాడి స్థానంలో మరొకణ్ణి రంగంలో దింపి నాటకమాడచ్చు!

జగ్గన్న చిత్తరపోయి చూశాడు. ఆఖరికి దాని మూలంగా తన పరువు మంటగలిసిపోయిందన్నమాట! ఆఖరికి దానికి ఏమి అంటగట్టినా పాపంలేదు.

తిన్నగా గుడిసె కొచ్చాడు. ఎదురుగా వచ్చింది మంగి.

'తాగినోడివి గమ్మునుండక రోడ్డుమీద తందనాలు తొక్కితే వూరుకొంటా రనుకున్నావేటి? నీ సేనాలకి ఉసూరుమని ఏడవనేక యిడిపిచ్చాను.'

'నోర్ముయ్! నీకంత డబ్బెక్కణ్ణుంచి వచ్చిందంట! ఎవడిచ్చాడంట? సెప్పు. ఆణ్ణీ నిన్ను కూడా ముక్కలు ముక్కలుకింద నరికేత్తాను.'

'సీ....పాపిష్టోడా! ఇయ్యాల నీ నోటెంత మాట యిన్నాన్రా? పాముకి పాలుపోసినట్టయింది. ఆ మహాతల్లి వసుంధరమ్మ గారిచ్చారంటే మాతరం నీతల కెక్కుద్దేటి?'

వలవల ఏడ్చింది.

'జుట్టట్టు కీడిసేవోడులేక మళ్లీ యెందుకే ఆ కల్లబొల్లి మాటలు....అమ్మగారంట అమ్మగారు....అమ్మగా రివ్వానికి, ఆవిడకేం పెంపుడు కూతురివా? నీ మొగాన ముద్దులొత్తున్నాయా? నిజం సెప్పు. నేకపోతే నిన్నియ్యాల బతకనియ్యను.'

అంటూ జుట్టు పట్టుకొని ఈడ్చాడు. తన్నాడు. అన్నింటికీ ఓర్చుకుంది. తుద కిలా తయారయాడు తన మొగుడు. లేనిపోని నీలాపనిందలు మోపాడు. సహింపలేని అభాండం తన తలమీద బద్దలు గొడుతున్నాడు.

ఇక తనేం చెప్పినా నమ్మడు. వినడు?!—అనుకొంటూ శరీరమంతా కన్నులు కన్నులై వలవల ఏడ్చింది.

జగ్గన్నకు మెరుపులాంటి ఆలోచన తోచింది.

'నువ్విలాగ్గాదే ఆ జుట్టు మొదలంటా గొరిగించితేగాని నీకు బుద్ధిరాదే! జమీందారీ అమ్మగారి కమ్మి పారనూకితే నీ పీడా యిరగ

# జడ ప్రకృతులు

డవుద్ది. మంగల్ని తీసుకొత్తానుండు. ఇల్లు కదిలావంటే వీరగతం కళ్ల జూత్తాను' అని బయటి తలుపు గొళ్లెంవేసి పరుగెత్తాడు.

'నీ యెదవబతుకు...యీణ్ణిన్నాళ్లా మన్నించి నందుకు మంచి సేస్తి జరిగినాది.' మంగికి పాలుపోలేదు. ఈ గోడు గోడంతా వసుంధరమ్మ గారితో చెప్పుకొంటేనే గాని లాభంలేదు.

గుమ్మం తలుపు ఆదరా బాదరా తోసి, తీయ ప్రయత్నించింది. ఒక్క పొలికేక పెట్టింది. ఎవరో ఆ దారిన పోతున్నవారు గొళ్లెం తీశారు. ఒక్క పరుగున బయటపడింది మంగి. పరుగు పరుగున వెనక్కయినా తిరిగి చూడకండా రోజుకొంటూ వచ్చిపడింది వసుంధ రమ్మగారి కాళ్ల ముందు.

'అమ్మగారు...అమ్మగారూ. యీ తల కాపాడుకోండి! ఆ దిక్కుమాలినోడి కళ్ళు ఈ జుట్టుమీద పడ్డాయండి! కత్తిరింపించి ఎవరో జమీందారమ్మగారికంట అమ్మిపారేస్తానంటూ ఎంటబడ్డాడండి!'

గొంతు బొంగురుపోయి, కన్నీరులో ముంచి నట్టయింది.

'ఆ ఎంతమాటన్నావు! వాడికేం పోయేకాల మొచ్చిందే! జైలునుంచి విడిపించి తీసుకొచ్చి నందుకిదా ఫలితం! రానీ! అయ్యగారితో చెప్పి వాడిపని పట్టిస్తాను. వాడి కోరలు తీయిస్తాను. ఆఖరికి ఆడదంటే వాడికింత అలుసయ్యిందా? నీ జుట్టుమీద ఆ దుర్మార్గుడికేం అధికారం ఉంది?'

వసుంధర రౌద్రరూపం చూసి మంగి చలించింది.

'అది కాదండమ్మగారూ!'

'అదికా దిదికాదు! నువ్వూరుకో! నీకేం తెలియదు. నిక్షేపంలాంటి తలకట్టు కత్తిరి కెరవేస్తే ఇంకేవన్నావుంది? తను బతికుండగానే చావాలనుకొంటున్నాడా? వాడికివ్వేళ దేమూడింది.'

'అమ్మగారూ!'

వసుంధర మంగి గొంతు విని ఆగింది. ఆవేశం ఎలా పలికిందో నెమరు వేసుకుంది. దాసీపిల్ల మంగేవిటి? దాని జుట్టుతో తన దోబూచులాట లేవిటి? దానిమీద తన కథి కారం ఏముంది? తన అంతస్థేమిటి? దాని అంతస్థేమిటి?

అంతా అయోమయంగా ఉంది తనకు. తన ప్రకృతి తనకే విచిత్రంగా తోచింది. తన కంటే జమీందారిణే నయం. దానికి వెలపెట్టి అనుభవంలోకి తెచ్చుకోవాలనుకొంది!

'మంగీ' అంటూ కళ్లలో క్షమాపణ అడిగి నట్టు అన్నది.

'అది కాదండమ్మగారూ! నా తల కత్తిరిం పించి, అమ్మేసి తాగేస్తాడండి! నాకు నచ్చేటంత జబ్బుచేసినప్డు మాయమ్మ ఏడుకొండల యెంకన్న బాబుకి ముడుపు గట్టిందండి! అదేనండీ నా యేడుపు! ఇదంతా మూనాళ్ల ముచ్చటేనండి! ఆడెంత సెప్పినా యినుకోడండి!' మంగి చెప్పింది విని తెల్లబోయింది వసుంధర.

ఇదా సంగతి! ఇన్నాళ్లనుంచీ తనకు తెలియనే తెలియదు. 'ఈ సంగతెందుకు దాచావు?' అని అడగాలనుకొంది. కాని అడగలేదు. ఏదో బల హీనత తన హృదయం చుట్టూ మూగి క్రుంగ తీస్తోంది. తనకూ కాదు. జమీందారిణికీకాదు. మధ్య దేవుడొచ్చి అడ్డం పెడుతున్నాడు! ఆఖరికి ఎవరికి ప్రాప్తో వారికే సంతృప్తి!

మధ్యాహ్నంపూట జగ్గన్న ఒంటిగా వచ్చాడు. శివనాథరావుగారు బయట పడక కుర్చీలో పడు కొని పేపరు చదువుకొంటున్నారు.

'అయ్యగారూ! అదింటికి రానేలేదండి ఇయ్యాళ. . .అది నాతో కాపురం సేస్తదో సెయ్యదో, యియ్యాల అంతు తేలిచేస్తానండి! దాని పాపం పండిందండి!'

శివనాథరావుగారు పేపర్లోంచి ముఖం పైకెత్తి చూశారు. వసుంధరను పిలిచారు.

'మంగి లోపలుందా?'

'ఏం?'

'వాడొచ్చాడు చూడు.'

జగ్గన్న అందుకొన్నాడు. 'ఔనండమ్మ గారూ ! అది నన్నేడిపించుకు తినేస్తోందండి ! ఇయ్యాల్టికింకా ఇంటి గుమ్మం యెక్కనేదంటే సూడండి ! అదెంత తిరుగుబోతయిందో? నాతో అది కాపరం సేస్తదో సేయదో ఈపరికి తేల్చిపారేస్తానండి !'

'అది సరేగాని, అది వెంకటేశ్వరస్వామికి ముడుపుగట్టిన జుట్టు కత్తిరింపించి జమీందా రిణిగారికి అమ్మిపారేస్తానన్నావుట ! అదేం బుద్ధిరా!'

'రామ ! రామ ! ఎంతమాటన్నారండి ! దీని మొక్కు సంగతి నాకు తెలవకపోదండి ! జమీందా రమ్మగారూ అళ్లా పెత్తిరపతెల్తంటే, దీని జుత్తు ముడుపుగట్టి ఆరి కివ్వనాని కేర్పాటు సేసేనండి ! ఆళ్ళ మొక్కు పెల్లింతే సాలండి మాలాటోళ్లకి. అక్కడికెల్లి మొక్కుబడి పెల్లిం చుకోనానికి మా దగ్గర డబ్బేడది సెప్పండి ? దాని జుట్టుతోటి నాకు పనేంటి ఖర్మం. .'

మంగి బయటికొచ్చి, 'ఆడి మాటలు నమ్మ కండమ్మగారూ !' అంది.

'ఇయ్యాల్టితో కాపరం సంగతి అంతు తేల్చిందే!' అని భీష్మించుకు కూచున్నాడు జగ్గన్న.

'నా తల ముట్టనని ఒట్టేస్తే యెల్తానం డమ్మగారు!'

'ఒట్టే.

మంగి తటపటాయించింది. వసుంధరమ్మ గారి వైపు దీనంగా చూసింది.

'వెళ్ళు—' అన్నట్టు సైగ చేశారు.

మంగి వీపుమీద కుబుసం విడిచిన పాము లాంటి జడ నలిగినట్టు వళ్లై చచ్చినట్టుండడం చూసి తన జడప్రకృతిని వదిలినట్టయింది వసుంధర.

శివనాథరావుకుకూడా తనకు తెలియకుండానే తన కళ్ళు ఆ ప్రకృతి ననుసరించినట్టు కనిపిం చింది.

మంగి జగ్గన్నతో బయల్దేరి వెళ్లిపోయింది.

• • •

అంతే. మంగి మళ్లీ పనిలోకి రాలేదు !

కొన్నాళ్లకు —

ఒక రోజు ముసుగు కప్పుకొన్న తలతో ఒక మనిషి - పోర్టికోలో తారట్లాడుతూండటం కనిపెట్టి వసుంధర, 'ఎవరు వారు ?' అని కేకే సింది.

'నేనండమ్మగారూ !' ముఖమెత్తి చూసింది మంగి. మామ్మగారు కూడా యాత్రల్నుంచి వచ్చేసినట్టున్నారు.

'నువ్వా ? ఆ వేషంలో చూసి వసుంధరకు అసహ్యమనిపించింది. తల లేదు. జడ లేదు. నల్లగా మెరుస్తున్న భూమిమీద మొలిచిన గడ్డి పరకల్లా చిక్కగా పెరిగి ఉన్నాయి.

మంగి ఏదో చెప్పుతూంది.

'పెత్తిర్ప తెల్లానండీ. ఆడూ నేనూ. నా తల తీసెయ్యంగానే, మంగలాయనా, ఆడూ ఏంమాట్లాడుకొన్నారోగాని నా తలకట్టంతా తీసుకెల్లి, అల్లంతదూరాన కారాపించొన్న జమీందారిణిగారి కిచ్చేసేడండీ ! నేను లబో దిబోమని మొత్తుకొని ఏడిశానండీ !'

'అదా సంగతి' అనుకొంది వసుంధర.

ఆఖరికి ఓడిపోయింది తనేవన్నమాట !

'అమ్మగారూ !'

'వేరే పనిమనిషిని పెట్టుకొన్నాం. వేరే ఎక్కడన్నా చూసుకో !'

వసుంధర గిరుక్కున వెనక్కు తిరిగి లోపలికి వెళ్లిపోయింది.

తలమీద ముసుగు లాక్కుంటూ లోపల్నుంచి మామ్మగారు బయటికొచ్చి, 'హసి నువ్వటే మంగి ! యాత్రల కెళ్లావుటే నువ్వానూ' అన్నారు ఎగా దిగా చూస్తూ.

'అవునండమ్మగారూ !' లేత గుండెలో బరువు మోస్తూ, మంగి మరి మాటాడకుండా, అడుగులు తడబడుతూ బయటికి నడిచింది.

జడప్రకృతులన్నీ ఒక్కసారి చలించినట్ట యింది !

★

*మెలకువగా ఉన్నవానికి రాత్రి సుదీర్ఘమైనది. అలసినవానికి యోజనం సుదీర్ఘమైనది. నిజమైన ధర్మం ఎరుగని మూర్ఖునికి జీవితం అనంతమైనది.*